ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన ముగించుకొని ఈరోజు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రితో సమావేశమయ్యారు.
- మారుమూల ప్రాంతాల్లో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా సంచార వాహనాలను ప్రవేశపెడుతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- బాలికల అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు.
- రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

==================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనను ముగించుకొని ఈరోజు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, సత్యప్రసాద్, కందులదుర్గేష్ తదితరులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అక్కడి నుండి ఆయన హెలికాప్టర్ లో ఉండవల్లి లోని తన నివాసానికి చేరారు. కాగా... దావోస్ నుండి ఢిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి ఈరోజు ఉదయం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్‌కు పునరుద్ధరణ ప్యాకేజీ అందించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపామని, రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం మొదలైన కీలక అంశాలపై చర్చించినట్టు ముఖ్యమంత్రి సామాజిక మాధ్యంలో తెలియజేశారు.

==================

ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, వైద్య పరీక్షా సౌకర్యాలను మారుమూల ప్రాంతాలకు తీసుకు వెళ్ళేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ NACO సహకారంతో ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ ICTC సంచార వాహనాలను ఏర్పాటు చేసింది. విజయవాడలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ 10 కొత్త సంచార ICTC వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటికే వివిధ స్థాయిల్లోని వైద్యకేంద్రాలలో అందుబాటులో వున్న 16 ICTC ల ద్వారా హెచ్ఐవి వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే వారికి కూడా ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం మొబైల్ ICTC లను తీసుకువచ్చిందని తెలియజేస్తూ..

(వాయిస్ బైట్..28 సెకన్లు)-ఐ&పిఆర్

==================

బాలికా విద్య ప్రోత్సాహానికి, భ్రూణ హత్యల నివారణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యతోనే బాలికల అభ్యున్నతి సాధ్యమౌతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండటం విచారకరమని, వాటిని నివారించేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొంటూ...

(వాయిస్ బైట్..29 సెకన్లు)-పిటిసి, ఒంగోలు

==================

రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో ఈరోజు పర్యటించిన ఆయన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య సంరక్షణ, ఉత్పాదకత పెంపుదల, పశుపోషణ ఖర్చుల నియంత్రణ కోసం ఈ నెల 31 వరకు అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పశుపోషకులందరూ ఈ శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

(వాయిస్ బైట్..26 సెకన్లు)-పీటీసీ, కోనసీమ

===================

విరామం

===================

విజయవాడలోని సెంట్రల్ బోర్డ్ కస్టమ్స్ అధికారులు 3 కోట్ల రూపాయల విలువైన గంజాయి, 10 కోట్ల రూపాయల విలువైన సిగరెట్లు, 20 లక్షల రూపాయల విలువే చేసే 10టన్నుల చైనిక్ గార్లిక్ లను ఈ రోజు గుంటూరు నగర పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్లో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జి.యస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. చైనిక్ గార్లిక్ ని కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో నిషేధించడం జరిగిందని తెలిపారు. అక్రమంగా విదేశీ నాణ్యతగల నకిలీ సిగరెట్లు అమ్మడం, కొనడం చేసినట్లయితే నేరంగా పరిగణిస్తామని ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోప్టా చట్టం ప్రకారం ఇలాంటి వాటిని వినియోగించడం నిషేధమని స్పష్టం చేసారు. బర్మీస్, మయన్మార్ భాషలో ఉన్న సిగరెట్ పెట్టెలు భారీగా పట్టుకోవడం జరిగిందని జి.యస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్..28 సెకన్లు)- పీటీసీ, గుంటూరు

===================

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2025 సంవత్సరం డైరీని హోం మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యతతో పనిచేస్తే, సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి లోతుగా తీసుకువెళ్ళాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ముందుకు వెళ్ళాలని అన్నారు.

===================

రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈరోజు బాపట్ల జిల్లా చీరాలలో పర్యటించారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, కోస్తా ప్రాంతాల భద్రత కోసం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటరింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరా మానిటరింగ్ వ్యవస్థను నెలకొల్పుతునట్టు పేర్కొన్నారు. చీరాల, వేటపాలెం తీర ప్రాంతాల్లో 30కి పైగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణకు సిబ్బందిని నియమించామని చెప్పారు. మార్చి చివరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికల సిద్ధం చేసామని పేర్కొంటూ...

(వాయిస్ బైట్..26 సెకన్లు)-పీటీసీ, బాపట్ల

===================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కొత్తగా నియమితులైన ఇద్దరు అదనపు న్యాయమూర్తులు ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అదనపు న్యాయమూర్తులుగా ఈ ఇద్దరూ ఈరోజు బాధ్యతలు చేపట్టడంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది.

===================

వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్పీగా ఈ.జి. అశోక్ కుమార్ ఈరోజు బాధ్యతలు  స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్ పోలీసింగ్ ను ప్రజలకు చేరువ చేస్తామని, మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. సైబర్ క్రైమ్ ను అదుపు చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

===================

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గీత కులాలకు జిల్లాలో 14 మద్యం దుకాణాలు కేటాయిస్తూ విశాఖ జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో ఎక్సైజ్ డీసీ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, గీత కులాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈరోజు నిర్వహించారు.

===================

===================